## క్లుప్తంగా

### స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి



**నిజామాబాద్ సిటీ:** మున్సిపల్ కార్పొరేషన్ సరఫరా చేసే నీరు స్వచ్ఛంగా ఉండాలని, క్లోరినేషన్ వెంటది వెంటనే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను కమిషనర్ మంగళవారం పర్యవేక్షించారు. ఇంజినీరింగ్ కార్యాలయాల్లో, వాటర్ ట్యాంకర్ల వద్ద నీటిని పరిశీలించారు. ప్రతీరోజు నీటి నాణ్యత, స్వచ్ఛతను పరీక్షించాలని ఇంజినీరింగ్ అధికారులు, డీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ పావని, భూమేశ్వర్‌లకు సూచించారు.
ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి బుధవారంతో పూర్తికానున్నాయి. సీడీఎంఏ అధికారులు వంద రోజుల పాటు అన్ని విభాగాల నుంచి ప్రతీ రోజు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని షెడ్యూల్ ఖరారు చేశారు. షెడ్యూల్ ప్రకారం బల్దియా అధికారులు ప్రత్యేక పనులు చేపట్టారు. బుధవారంతో వంద రోజులు పూర్తికానున్నాయి. చివరి రోజు బుధవారం ఉదయం 8 గంటలకు బల్దియా కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించనున్నారు. అంబేడ్కర్ భవన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలు ఇవ్వనున్నట్లు కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

### టీజీవో సభ్యత్వ నమోదు

**నిజామాబాద్‌అర్బన్:** గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో టీజీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, దేవి సింగ్, చందర్, భరత్ రాజ్, జయ ప్రసాద్, ముత్తెన్న, చంద్రశేఖర్, రాజేశ్, రాహుల్, వేణు గోపాల్, బాలామణి, ఉమాకిరణ్, అనసూయ, రామస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



**నిజామాబాద్‌నాగారం:** జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు డీజీఎం గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని విశ్వభారతి క్యాంపస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. అక్టోబర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్, ప్రిన్సిపాల్ దేవేందర్ రెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గోవింద్‌పల్లిలో వైద్య శిబిరం



**ధర్పల్లి:** మండలంలోని గోవింద్‌పల్లిలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 256 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మమత, వినోద్ కుమార్, దుర్గా ప్రసాద్, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

### ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

**నిజామాబాద్ రూరల్:** రూరల్ పీఎస్ పరిధిలోని పంచాయతీరాజ్ కాలనీకి చెందిన సూరజ్‌రావు(22) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన అటవీ శాఖ ఉన్నతాధికారి కుమారుడైన సూరజ్‌రావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 111,200 | వెండి(కిలో) | 1,30,500 |
| 22 క్యారెట్స్ | 102,675 | - నిజామాబాద్ బిజినెస్ | |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు | డ్రెస్డ్ | 160 |
| | (కిలోకు) | లైవ్ | 120 |
| స్కిన్‌లెస్ | 200 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 24 | 48 | గాజరుగడ్డ | 30 | 60 |
| బెండకాయ | 30 | 60 | పచ్చిమిర్చి | 30 | 60 |
| బీరకాయ | 40 | 80 | దోసకాయ | 15 | 30 |
| దొండకాయ | 30 | 60 | ఆలుగడ్డ | 20 | 40 |
| బీర్నిసుకాయ | 60 | 110 | గోబిగడ్డ | 15 | 30 |
| కాకరకాయ | 30 | 60 | గోబిపువ్వు | 30 | 60 |
| వంకాయ | 40 | 80 | బీట్‌రూట్ | 30 | 60 |
| పాలకూర | 50 | 100 | కరివేపాకు | 40 | 80 |
| మెంతికూర | 60 | 110 | చామగడ్డ | 30 | 60 |
| కొత్తిమీర | 40 | 80 | చిక్కుడుకాయ | 60 | 100 |
| పుదీనా | 50 | 100 | గోరుచిక్కుడు | 40 | 80 |
| క్యాప్సికం | 40 | 80 | | | |

-సుభాష్‌నగర్

# చిరస్మరణీయుడు కాళోజీ

- సాహిత్యంతో తెలంగాణ సమాజాన్ని చైతన్యపర్చిన వైతాళికుడు
- కాళోజీ జయంతి వేడుకల్లో వక్తలు




కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన డీసీపీ బస్వారెడ్డి, పోలీసులు, ఉద్యోగులు

**ఖలీల్‌వాడి :** జీవితాంతం తెలంగాణ ప్రజల గొంతుకగానే ఉన్న కాళోజీ నారాయణరావు చిరస్మరణీయుడని పలువురు వక్తలు అన్నారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో కాళోజీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమం, భవిష్యత్ తరాల కోసం పోరాడిన గొప్ప కవి కాళోజీ అని అన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, బషీర్, వనజ రాణి, రిజర్వు సీఐ శ్రీనివాస్, తిరుపతి తదితరులు ఉన్నారు.

**ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో..**

**నిజామాబాద్ అర్బన్:** నగరంలోని ఖలీల్‌వాడిలో ఉన్న ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్ఎస్ఆర్ కళాశాల చైర్మన్ డాక్టర్ మారయ్యగౌడ్ మాట్లాడుతూ.. కాళోజీ సాహిత్యం తెలంగాణ భాషకు ప్రతీక అని అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ భాష దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి గొప్ప కవి కాళోజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కో–ఆర్డినేటర్ వేణుగోపాల్, డాక్టర్ తక్షశిల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**జీజీ కళాశాలలో..**

నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల కొరవి గోపరాజు తెలుగు విభాగం ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ పి.రామ్మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తన కవిత్వంతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన గొప్ప కవి కాళోజీ అని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. రంగరత్నం మాట్లాడుతూ.. తెలుగు భాష అభివృద్ధికి కవులు, రచయితలు, పరిశోధకులు ఎందరో కృషి చేశారన్నారు. తెలుగు విభాగం అధిపతి, లెఫ్టినెంట్ డాక్టర్ ఎం. రామస్వామి మాట్లాడుతూ.. కాళోజీ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాజేశ్, అకడమిక్ కోఆర్డినేటర్ నహీద బేగం, రాహుల్, రమేశ్‌గౌడ్, అనసూయ, సుభాషిణిదేవి, కార్యక్రమ నిర్వాహకురాలు బి.రాధిక, తెలుగు అధ్యాపకులు కె.గంగాధర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శమంత, ఆర్.రాజేశ్వర్, అర్చన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాళోజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్ దిలీప్‌కుమార్

**తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో..**

**నిజామాబాద్ రూరల్:** తెలంగాణ భాషను, యాసను కాపాడాలని కోరిన యోధుడు కాళోజీ నారాయణరావు అని తెలంగాణ రచయితల వేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా నగరంలోని గాజుల్‌పేట్‌లో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. వేముల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**చీమన్‌పల్లిలో..**

**సిరికొండ:** మండలంలోని చీమన్‌పల్లి గ్రామంలో ప్రజాకవి తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాజీ సర్పంచ్ జితేందర్‌సింగ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాద్, ప్రవీణ్, ముత్యంరెడ్డి, రాజారెడ్డి, నారాయణ, లక్ష్మయ్య, శంకర్, బక్కన్న, రాము, శంకర్‌బాబు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**ముదక్‌పల్లిలో..**

**మోపాల్:** మండలంలోని ముదక్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి నిర్వహించారు. ఉపాధ్యాయుడు ప్రేమ్‌లాల్ మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు మహానుభావుడని కొనియాడారు. తెలంగాణ భాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పుష్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ సిటీ:** ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కాళోజీ విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎస్ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు



చీమన్‌పల్లిలో.. గ్రామస్తులు



ముదక్‌పల్లి ప్రైమరీ స్కూల్‌లో నివాళులు అర్పించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

# వారాహి ఆలయానికి కృష్ణశిల

- ప్రత్యేక పూజలు చేసిన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

**సుభాష్‌నగర్:** నగరంలోని అమ్మనగర్‌లో రూపుదిద్దుకుంటున్న శ్రీ వారాహి దేవాలయానికి పవిత్ర కృష్ణశిల మంగళవారం చేరుకుంది. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ శిలకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం దేవి వారాహి అమ్మవారి పూజా దినం కావడంతో ఆలయ నిర్మాణానికి మరింత ప్రత్యేకత చేరింది. ఆలయ గర్భగుడికి ఉపయోగిస్తున్న రాయి కృష్ణ శిలను తమిళనాడు రాష్ట్రంలోని మాతూరు ప్రాంతం నుంచి తీసుకొచ్చారు. పవిత్ర కృష్ణశిలతో ఆలయం నిర్మించడమనేది శాస్త్రోక్తంగా, ఆధ్యాత్మికంగా గొప్ప విశేషమని వేద పండితులు పేర్కొంటున్నారు.



కృష్ణశిలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

## కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి

**నిజామాబాద్ నాగారం:** కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు అందించాలని టీఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కల్లెడి గంగాధర్ అన్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్మికుల సాధారణ మరణానికి రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షలు, ప్రమాదవశాత్తు మృతికి రూ. ఆరు లక్షల నుంచి రూ. పది లక్షల వరకు కేటాయించడం సంతోషించదగ్గ విషయమన్నారు. అలాగే కార్మికులకు సొంత ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, 60 ఏళ్లు నిండిన వారికి రూ. ఆరు వేల పింఛన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణు, బాబురావు, శాంతయ్య, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.



సీఎం, కార్మిక శాఖ మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

## కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

**నిజామాబాద్ నాగారం:** తమ భూమిని అక్రమంగా కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని బాధితులు శ్రీధర్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్ కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బోధన్ పట్టణ కేంద్రంలో ఉన్న 271/అ లో అదే ప్రాంతానికి చెందిన కొందరు కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మీ భూమి బోధన్ ఆర్టీసీ భూమిలో కలిసిపోయిందంటు నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తమ భూమిని కబ్జా చేసిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. ఈ విషయమై స్థానిక తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందించినట్లు వారు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్

## బీడీ కార్మికులకు పని దినాలు కల్పించాలి



హిమ్మత్‌లాల్ బీడీ కంపెనీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

**డిచ్‌పల్లి :** హిమ్మత్‌లాల్, మణిలాల్ టొబాకో పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సరిపడా పనిదినాలు కల్పించాలని టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని హిమ్మత్‌లాల్ బీడీ కంపెనీ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాజేశ్వర్, ఎం.వెంకన్న మాట్లాడుతూ.. కంపెనీ యాజమాన్యం బీడీ కార్మికులకు సరిపడా పని దినాలు, నాణ్యమైన తునికాకు, దారం ఇవ్వడంలేదని, ప్రతి నెలా కూలీ చెల్లింపులు సరిగా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల కూలీ బకాయిలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రెండు నెలల బకాయిలు వెంటనే చెల్లిస్తామని మిగతా డిమాండ్లు యాజమాన్యంతో చర్చించి నెలరోజుల్లోపు పరిష్కరిస్తామని మేనేజర్ హామీ ఇచ్చారు. దీంతో బీడీకార్మికులు ధర్నా విరమించారు.

కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి డి.కిషన్, జిల్లా నాయకులు పి.సాయిరెడ్డి, నాయకులు సాయిబాబా, లక్ష్మి, సుజాత, గంగామణి, అనసూయ, జమున, శ్యామల, రాధిక, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి కృషి చేయాలి



ధర్పల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

**ధర్పల్లి:** ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు కార్యక్రమానికి తహసీల్దార్ శాంత, ఎంపీడీవో లక్ష్మారెడ్డి హాజరై 18 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రమేశ్ కుమార్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి సతీశ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..**

**నిజామాబాద్ అర్బన్:** రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సీఎం చేతుల మీదుగా అవార్డు పొందిన బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శంకర్‌ను ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు బోర్గాం(పి) ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచందర్ గైక్వాడ్, భూషణ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మోతె సాయన్న, రాష్ట్ర కోశాధికారి నాంది సుశీల్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు నితిన్, రజిన్ కుమార్, శివానంద, గంగాధర్, సుదర్శన్, బలరాం తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

### కార్మికుల శ్రమ దోపిడీ సరికాదు

**డిచ్‌పల్లి:** తాజ్ బీడీ కంపెనీ మూడేళ్లుగా బీడీ కార్మికులతో పనులు చేయించుకుని వారి పీఎఫ్ ఖాతాల్లో డబ్బులు జమచేయకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని తాజ్ బీడీ కంపెనీ వద్ద బీడీ కార్మికులతో ధర్నా నిర్వహించారు. వచ్చే నెల 10వ తేదీ లోపు కార్మికులకు ఇవ్వాల్సిన అన్ని బకాయిలు చెల్లించాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు లత, లావణ్య, సారిక, మమత, మంజుల, సరళ, రజిత, లావణ్య, భాగ్య, సుస్మిత పుష్ప, మానస, దివ్య, నవ్య, సంహిత, నవిత, సుజాత, నేహా, సంహిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహార కిట్స్ అందజేత



**నిజామాబాద్ నాగారం :** టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా మంగళవారం నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్స్‌ని చైర్మన్ ఆంజనేయులు మంగళవారం అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రెటరీ అరుణ్ బాబు, డివిజన్ చైర్మన్ శ్రీశైలం, జిల్లా టీబీ కో–ఆర్డినేటర్ రవిగౌడ్, లక్ష్మణ్, డీ పీఎం నరేశ్, విజయమాల, నవీన్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

### హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

**నిజామాబాద్‌అర్బన్:** గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష ఫలితాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన గ్రూప్–1 మెయిన్స్ జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తున్నట్లు హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా టీజీపీఎస్సీ అవకతవకలు పాల్పడకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### లింగేశ్వర ఆశ్రమం సందర్శన



**నిజామాబాద్ రూరల్:** మండలంలోని మల్లారంలో ఉన్న శ్రీ లింగేశ్వర ఆశ్రమం శంభుని దేవాలయాన్ని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి గంగాధర్‌గౌడ్ మంగళవారం సందర్శించారు. దేవాలయ వ్యవస్థాపకుడు కృష్ణ పిట్ల మహరాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్ రావు, మండల సీనియర్ నాయకులు బొల్లంక గోపాల్ రెడ్డి, అన్నం సాయిలు, అశోక్ కుమార్, బానోత్ గోపాల్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం, అనూష తదితరులు పాల్గొన్నారు

### మోపాల్‌లో సూచిక బోర్డులు ఏర్పాటు




**మోపాల్:** మండల కేంద్రంలోని లిటిల్ హార్ట్స్ ఎకో ఫ్రెండ్లీ గణేశ్ మండలి చిన్నారులు ప్రధాన కూడలిలో ప్రమాదకర సూచిక బోర్డులను మంగళవారం ఏర్పాటు చేశారు. చిన్నారులు మూడేళ్లుగా పర్యావరణానికి నష్టం కలగకుండా మట్టి గణనాథుడిని ప్రతిష్ఠించి పూజలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని నిరూపిస్తున్నారు. తాజాగా గ్రామంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు వారిని అభినందిస్తున్నారు. కార్యక్రమంలో చిన్నారులు అక్షర, హాస్య, కన్నయ్య, ఆకృతి, ఖుషి, యశ్వంత్, సహస్ర, హారిణి తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

**సిరికొండ:** మండలంలోని పెద్దవాల్గోట్‌లో వరద బాధితులకు సిరికొండ సత్యశోధక్ పాఠశాల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. 45 కుటుంబాలకు రూ. 25 వేల విలువ గల నిత్యావసర సరుకులను ప్రిన్సిపాల్ నర్సయ్య అందించారు. ఉపాధ్యాయులు గంగారాం, ప్రసాద్, మాజీ సర్పంచ్ గంగదాస్, కాంగ్రెస్ నాయకు లు గాదారి సర్దారెడ్డి, పోతన్నార్ లింగం, రి యాస్, మొజామిల్ తదితరులు పాల్గొన్నారు.



# విధుల్లో చేరిన గ్రామ పాలన అధికారులు



మోపాల్‌లో తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీపీవోలు



డిచ్‌పల్లిలో తహసీల్దార్‌కు..

**మోపాల్/ డిచ్‌పల్లి/ నిజామాబాద్ రూరల్:** మోపాల్ మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో పాలన అధికారులు(జీపీవో) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 13 రెవెన్యూ గ్రామాలను 17 క్లస్టర్ విలేజ్‌లుగా విభజించారు. 13 మంది జీపీవోలను మండలానికి కేటాయించగా, 11 మంది తహసీల్ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్ట్ చేశారు. 2 రెవెన్యూ గ్రామాలకు జీపీవోలను ఇంకా కేటాయించాల్సి ఉంది. అనంతరం తహసీల్దార్ సరితను మర్యాద పూర్వకంగా కలిశారు. డిచ్‌పల్లి మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో పాలనా అధికారులు బాధ్యతలు స్వీకరించారు. డిచ్‌పల్లి మండలానికి 16 మంది జీపీవోలను కేటాయించగా వారిలో 13 మంది విధుల్లో చేరారు. మిగిలిన ముగ్గురు బుధవారం విధుల్లో చేరనున్నారు. జీపీవోలు తహసీల్దార్ సతీశ్‌రెడ్డిని శాలువా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ లు భూపతి ప్రభు, సీనియర్ అసిస్టెంట్ అశ్వక్, సిబ్బంది పాల్గొన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలో 14 మంది గ్రామ పరిపాలన అధికారులు విధుల్లో చేరినట్లు తహసీల్దార్ అనురుద్ తెలిపారు. క్లస్టర్ పరిధిలో 14 మంది విధుల్లో చేరినట్లు ఆయన పేర్కొన్నారు.

# పారదర్శకంగా బదిలీలు

- ఎన్‌డీసీసీబీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపిన కార్యదర్శులు, సిబ్బంది

**సుభాష్‌నగర్ :** పీఏసీఎస్‌ల కార్యదర్శులు, సిబ్బంది బదిలీలను పారదర్శకంగా చేపట్టడంపై ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డికి యూనియన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దయాసాగర్, దొంతుల నర్సయ్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధులు శ్రీకాంత్, జాకీర్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బదిలీల్లోభాగంగా తమను కొత్త జిల్లా లేదా డివిజన్ వారీగా బదిలీ చేయాలని కోరామని, కానీ మండల స్థాయిలో, బ్యాంక్ బ్రాంచ్ స్థాయిలో చేయడం ఊహించలేదని హర్షం వ్యక్తం చేశారు. సర్వీస్ రెండేళ్లలోపు ఉన్న వారికి, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారని తెలిపారు. రిటైర్మెంట్ అయిన వారికి బెనిఫిట్స్ సొసైటీ నుంచి కాకుండా బ్యాంక్ ద్వారా ఇప్పిస్తామని చైర్మన్ ప్రకటించడంపై వారు సంతోషం వ్యక్తంచేశారు. జీవో 44 వచ్చి 33 నెలలు అవుతున్నా.. కొన్ని సంఘాల్లో ఆ ప్రకారం జీతాలు ఇవ్వడం లేదన్నారు. కార్యదర్శి పదవీ విరమణ చేసిన తర్వాత కింది ఉద్యోగికి సంఘ కార్యదర్శిగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. సమస్యలపై రమేశ్‌రెడ్డి సానుకూలంగా స్పందించినందుకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.